# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ ఉదయం ప్రైవేటు బస్సు అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో 9 మంది మృతి చెందారు.**

2. **ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2 లక్షలు, క్షతగాత్రులకు 50 వేల రూపాయల పరిహారాన్ని ప్రకటించారు.**

3. **విశాఖపట్నంలోని కాపులుప్పాడా ఐటీ హిల్స్‌లో కాగ్నిజెంట్ క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శంకుస్థాపన చేశారు.**

4. **రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

5. **భారత రత్న,మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి జీవితం అందరికీ ఆదర్శణీయమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.**

===========================

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ ఉదయం ప్రైవేటు బస్సు అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో 9 మంది మృతి చెందారు. జిల్లాలోని చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రాథమిక నివేదికల ప్రకారం, ఈ ప్రమాదంలో 9 మంది మరణించగా పలువురు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారని చెప్పారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులు చిత్తూరు జిల్లా , తిరుపతి జిల్లా వాసులుగా అధికారులు గుర్తించారని స్థానిక అధికారి తెలియజేస్తూ..

..వాయిస్.. 25 సెకన్లు

బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రెండు లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయలు పరిహారాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు.

-------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లా బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై వివరాలను, క్షతగాత్రులకు అందుతున్న సాయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో 9 మంది మృతి చెందగా, గాయపడిన వారిని చింతూరు ఆసుపత్రికి తరలించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టాలని, అన్ని శాఖలు సమన్వయంతో బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ ఘటనపై ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్‌తో పాటు హోం మంత్రి వి.అనిత, రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు సంతాపం వ్యక్తం చేశారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలోని కాపులుప్పాడా ఐటీ హిల్స్‌లో కాగ్నిజెంట్ క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఐటీ శాఖామంత్రి నారా లోకేష్, విశాఖ పార్లమెంటు సభ్యులు ఎమ్.శ్రీభరత్‌తో పాటు పలు ఐటీ సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపన అనంతరం విశాఖ ఆర్థిక ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. జిల్లాల సమగ్ర అభివృద్ధి, రోడ్లు, రైలు మార్గాలు, పోర్టులు, లాజిస్టిక్స్ ఇతర అభివృద్ధి ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి చర్చిస్తారు.

---------------------------

విశాఖపట్నంలో 7 ఐటీ సంస్థల క్యాంపస్‌ల నిర్మాణాలకు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ భూమిపూజ చేశారు. రుషికొండ ఐటీ పార్కులో ఏర్పాటు చేయనున్న ఈ సంస్థ శిలా ఫలకాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్, స్థానిక ప్రజాప్రతినిధులు గంటా శ్రీనివాసరావులతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సంస్థలు 3 వేల 740 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు పెట్టడం ద్వారా 41 వేల 700 మందికి ఉద్యోగ అవకాశాలు కలుగనున్నాయని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో “ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ బిజినెస్ ఎక్స్ పో 2025 “ను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాపార రంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ బిజినెస్ ఎక్స్ పో ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నారని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణలు రెండో రోజూ కొనసాగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భవానీ దీక్షాధారులు పెద్ద సంఖ్యలో కాలినడకన తరలివస్తున్నారు. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో నిన్న ప్రారంభమైన భవానీ దీక్షల విరమణ కార్యక్రమం ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఆలయ అధికారులు,

ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శీఘ్ర దర్శనం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. దీనిలో భాగంగా రుసుము ద్వారా దర్శనం, ఆర్జిత సేవలను రద్దు చేశారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగాఅన్ని జిల్లా కేంద్రాల్లోని న్యాయ స్థానాలలో వివాదాలు, కేసులను త్వరగా పరిష్కరించుకోవడానికి రేపు లోక్ అదాలత్ జరుగుతుందని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. ఎస్.వి. హిమబిందు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో అపరిష్కృతంగా ఉన్న ఆస్తి తగాదాలు, సివిల్ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద నష్ట పరిహార కేసులు, రాజీ పడదగిన అన్ని క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా రేపు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్య తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అటల్ – మోదీ బస్సు యాత్ర ఈరోజు అనంతపురం జిల్లాకు చేరుకుంది. ఉదయం అనంతపురం కలెక్టర్ కార్యాలయం నుండి ఈ యాత్ర ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డులో అటల్ బిహారీ వాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ భారత రత్న,మాజీ ప్రధాని వాజపేయి అందరికి ఆదర్శమని అన్నారు. అలాగే మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ వాజపేయి గొప్పవక్త అని, ఆయన జీవితం దేశభక్తి ,మానవతా విలువల కలయికని కొనియాడారు.

---------------------------

అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ఘాట్ రోడ్లపై రాత్రి సమయంలో భారీ వాహనాల ప్రయాణంపై నిషేధం అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. శీతాకాలం దృష్ట్యా ఘాట్ రోడ్డు వంతెనలపై దట్టమైన పొగమంచు ఉంటుందని ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా ప్రయాణికుల భద్రత కోసం రాత్రి 10:00 గంటల నుండి తెల్లవారుజామున 5:00 గంటల వరకు, జిల్లాలోని అన్ని ఘాట్ రోడ్లపై భారీ వాహనాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు .

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంకేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన నిన్న పాల్గొన్నారు.

=====================